సాక్షి తిరుపతి

శనివారం। 15। ఏప్రిల్। 2023



సంయుక్త ఆనందం!

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీనటి సంయుక్త మీనన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.



పక్షుల కేంద్రంలో అభివృద్ధి పనులు

దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.

8లో▸

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	24
చిత్తూరు	39	23
తిరుమల	36	19
గూడూరు	41	26
నగరి	41	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం(సా)	సహర్ ఆదివారం(ఉ)
తిరుపతి	6.29	4.39
చిత్తూరు	6.31	4.39
పుంగనూరు	6.32	4.42

తొలిరోజే కానుక !

పేదరికంతో ఏ ఒక్క విద్యార్థీ చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేశారు. ఇప్పటికే నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులకు సకల వసతులు కల్పించారు. దీంతోపాటు విద్యార్థులకు కావాల్సిన 8 రకాల విద్యాసామగ్రిని సమకూర్చుతున్నారు. బడితెరిచిన తొలి రోజే జగనన్న విద్యా దీవెన కిట్లు పంపిణీ చేసేలా చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా 2023–24 విద్యాసంవత్సరంలో విద్యార్థులకు కావాల్సిన కిట్లను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

- జగనన్న విద్యాదీవెన కిట్లు సిద్ధం
- బడితెరిచిన తొలిరోజే పంపిణీకి కసరత్తు
- గతానికి భిన్నంగా మండల స్థాయిలో స్టోరేజ్ పాయింట్లు
- కిట్ల నిల్వ, రవాణాకు జిల్లా, మండల స్థాయి కమిటీలు
- వ్యక్తిగతంగా విద్యార్థుల కొలతలను సేకరించిన అధికారులు





తిరుపతి రూరల్ : జగనన్న విద్యాదీవెన కిట్లు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది కిట్ల పంపిణీలో మరింత పారదర్శకతతో పాటు వేగంగా విద్యాకానుక అందించేందుకు కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఈ ఏడాది విద్యాకానుక సామగ్రిని ఆయా మండలాల హెడ్ క్వార్టర్స్‌కు నేరుగా వచ్చేలా చర్యలను చేపట్టారు. రాష్ట్రస్థాయి నుంచి మండల స్టాక్ పాయింట్లకు మే 1 నుంచి 31వ తేదీలోపు.. అక్కడి నుంచి జూన్ 1 నుంచి 12వ తేదీలోపు అన్ని స్కూల్స్‌కు అందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అంటే వేసవి సెలవుల తర్వాత విద్యార్థులు బడికి వచ్చిన మొదటి రోజే జేవీకే కిట్లను అందించనున్నారు. గతంలో విద్యార్థి తల్లి మాత్రమే వచ్చి కిట్టును తీసుకువెళ్లాలనే నిబంధన ఉండేది. ఇప్పుడు తల్లితో పాటు తండ్రి, విద్యార్థి కూడా బయోమెట్రిక్ వేసి తీసుకువెళ్లవచ్చు.

విద్యాకానుక కిట్‌లో..

బ్యాగు, అచ్చుపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనీఫాం, షూ, బెల్టు, రెండు రకాల డిక్షనరీలు అందించనున్నారు. ఇవి 1 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ అందించగా.. బెల్టులకు సంబంధించి 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు, 1 నుంచి 5వ తరగతి బాలికలకు అందిస్తారు. అలాగే నోట్‌బుక్స్‌ను 6వ నుంచి 10వ తరగతి విద్యార్థులకు.. డిక్షనరీలు 1 నుంచి 6వ తరగతి వరకు చదివే విద్యార్థులకు అందిస్తారు. ఇందుకు సంబంధించి గతేడాది డిసెంబర్ నుంచే విద్యార్థుల వివరాలను సేకరించడం తోపాటు వారికి సరిపడే విధంగా బూట్లు, యూనిఫాం కొలతలను సేకరించారు.

మండల స్థాయిలో స్టాక్ పాయింట్లు

జగనన్న విద్యాకానుకను గతంలో మాదిరిగా కాకుండా ఈఏడాది విద్యార్థులకు మరింత వేగంగా చేరవేసేందుకు ప్రతి మండల కేంద్రంలో స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. విద్యాకానుకకు సంబంధించిన సామగ్రి జిల్లా స్టాక్‌పాయింట్‌కు కాకుండా ఈ ఏడాది నేరుగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌కు రానున్నాయి. స్టాక్ పాయింట్‌కు వచ్చిన వస్తువులన్నింటికీ ఒక కిట్టు రూపంలో సిద్ధం చేసి అన్ని వస్తువులను ఒకేసారి విద్యార్థులకు అందించనున్నారు. దీంతోపాటు వీటి పంపిణీ పర్యవేక్షణకు ఒక కమిటీని కూడా నియమించారు. ఇందులో స్టోరేజీ పాయింట్ చైర్మన్‌గా ఎంఈఓను, కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సభ్యులుగా వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం, మండల ఇంజినీరు అధికారి, సీఆర్పీలను నియమించారు. వీరంతా విద్యాకానుక కిట్లు పాఠశాలలకు చేరవేసే సమయంలో కూడా అన్ని రికార్డులను మెయింటెనెన్స్ చేయాల్సి ఉంటుంది.

స్టాక్ పాయింట్లు	మండల స్థాయిలో	జిల్లా స్థాయిలో
	34	1

స్టోరేజీ పాయింట్లను తనిఖీ చేయనున్న రాష్ట్ర పరిశీలకులు



జగనన్న విద్యాకానుక పంపిణీపై సూచనలు చేస్తున్న రాష్ట్ర పరిశీలకులు రామలింగం(ఫైల్)

జిల్లాలో స్టోరేజీ పాయింట్ తనిఖీ కోసం రాష్ట్రస్థాయి జేవీకే ప్రత్యేకాధికారి, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా.రామలింగంను పరిశీలకులుగా నియమించారు. ఈయన ఈ నెల 8వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్టోరేజీ పాయింట్లను పరిశీలిస్తున్నారు. వర్షం పడినా జేవీకే సామగ్రి తడవకుండా ఉండేందుకు అన్ని రక్షణ చర్యలను అంచనా వేస్తున్నారు.



జిల్లా సమాచారం

అంశం	సంఖ్య
విద్యార్థులు	1,66,659
బాలికలు	82,990
బాలురు	83,669
బ్యాగులు	1,66,659
యూనిఫాం	1,66,659
నోట్‌బుక్స్	9,45,828
బెల్ట్స్	1,21,648
బూట్లు	1,66,419
డిక్షనరీలు	32,412

జిల్లాకు చేరిన డిక్షనరీలు



“ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో బడి తెరిచిన రోజే జగనన్న విద్యాకానుక కిట్టు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రతిపాదనలు పంపాం. 6వ తరగతి విద్యార్థులకు అందించే డిక్షనరీలు జిల్లాకు చేరాయి. మిగతా విద్యాసామగ్రి కూడా ఈనెల 15వ తేదీ తర్వాత రానుంది.

– డాక్టర్.శేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి, తిరుపతి జిల్లా

పక్కాగా పంపిణీ



జగనన్న విద్యాకానుక కోసం మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్టోరేజీ పాయింట్లను పరిశీలిస్తున్నాం.వస్తువులన్నీ నిల్వ ఉంచేందుకు తగిన వసతి ఉందా, వర్షం వస్తే తడుస్తాయా, విద్యాకానుక కిట్లకు భద్రత ఎలా ఉందనే అంశాలన్నింటినీ పరిశీలిస్తున్నాం. దీంతోపాటు విద్యాకానుక కమిటీలతో చర్చిస్తున్నాం.

– రామలింగం, జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర పరిశీలకులు జేవీకే

మార్గదర్శకాలు ఇచ్చాం



2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జేవీకే కిట్టును విద్యార్థులకు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. దీంతో పాటు ఈఏడాది నూతనంగా మండల స్థాయిలో స్టోరేజీ పాయింట్లను గుర్తించాం. జేవీకే సామగ్రి ఇప్పుడు నేరుగా మండల స్థాయి స్టోరేజీ పాయింట్లకు చేరుతుంది.

– సురేష్, సీఎంఓ, సమగ్రశిక్ష, తిరుపతి

న్యూస్‌రీల్

ప్రయాణికులతో గౌరవంగా మెలగండి

తిరుపతి అర్బన్: ప్రయాణికులతో గౌరవంగా వ్యవహరించాలని జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి శుక్రవారం సిబ్బందిని ఆదేశించారు. ప్రయాణికులు టిక్కెట్‌కు సరిపడా చిల్లర ఇవ్వడం లేదని కండక్టర్లు దురుసుగా వ్యవహరించడం, రిక్వెస్ట్ స్టాపింగ్‌లో నిలపకపోవడం లాంటి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రిక్వెస్ట్ స్టాపింగ్ విషయంలో డ్రైవర్లు ప్రయాణికు సహకరించాలని చెప్పారు. కండక్టర్లు ఫ్రెండ్లీగా ఉండాలి తప్ప ప్రయాణికులతో దురుగా మాట్లాడడం తగదన్నారు.

ఆరని మంటలు



సీతారాంపేట సమీపంలో దగ్ధమవుతున్న అడవి

ఏర్పేడు: మండలంలోని ఏర్పేడు, అంజిమేడు, సీతారాంపేట, నచ్చనేరి సమీపంలోని శేషాచల అడవుల్లో మూడు రోజులుగా మంటలు ఆరడం లేదు. బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అడవులు అగ్నికి ఆహుతవుతున్నాయి. వృక్ష, జంతు, పక్షి సంపద ఆవిరవుతోంది. ఇప్పటికే వేలాది ఎకరాల్లో అడవులు దగ్ధమయ్యాయి. అడవులు కాలిపోతున్నా సంబంధిత అటవీశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

104లో పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 104 వాహనాల్లో డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ ప్రతాప్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డ్రైవర్ పోస్టుకు 10వ తరగతి పాసై హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన అభ్యర్థులు, డేటా ఎంట్రీ పోస్టులకు ఏదైనా డీగ్రీ చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఐరాల, గంగాధరనెల్లూరు, పెద్ద పంజాణి, పుంగనూరు, బైరెడ్డిపల్లె, శాంతిపురం, రామకుప్పం, కుప్పం, గుడిపల్లె, వరదయ్యపాళెం, ఏర్పేడు, తిరుపతి, శ్రీకాళహస్తి, రేణిగుంట మండలాల్లో ఖాళీలున్నాయని వివరించారు. ఆసక్తిగలవారు ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు తిరుపతి మధురానగర్‌లోని 104,108 కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఉద్యోగ అవకాశాలు

తిరుపతి మంగళం: కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ కౌశల్ మహోత్సవంలో నిరుద్యోగ యువతకు విదేశాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎంపీ గురుమూర్తి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందేందుకు ఈ ఇంటర్నేషనల్ కౌశల్ మహోత్సవం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. వివరాలకు మురళీకృష్ణ 8801346518 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

19 నుంచి పది మూల్యాంకనం



మాట్లాడుతున్న జేసీ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు పది మూల్యాంకనం ఉంటుందని జేసీ డీకే బాలాజీ తెలిపారు. వేసవి సెలవుల్లో పాఠశాలలకు సంబంధించి రెండో విడత నాడు–నేడు పనులు పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు పేదలకు ఇవ్వాలన్నారు. పది పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించిన డీఈవో వి.శేఖర్‌తోపాటు పలువురు అధికారులను ఆయన అభినందించారు. ముఖ్యప్రణాళికాధికారి అశోక్‌కుమార్, డీఈఓ వి.శేఖర్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి జయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, తిరుపతి, శ్రీకాళహస్తి డీఎల్‌డీవోలు సుశీలాదేవి, ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్, గాంధీ విగ్రహాల ఆవిష్కరణ



అంబేడ్కర్, గాంధీ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ గురుమూర్తి, బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలను ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ విగ్రహాలను మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు. ఎంపీ మాట్లాడుతూ భారతీయుల జీవితాలలో వెలుగులు నింపిన మహనుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఆర్డీఓ కెఎస్.రామారావు, ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, జెడ్పీటీసీ అర్చనాదేవి, మునిరత్నం, వైస్ ఎంపీపీ మల్లికమ్మ, గెరటారెడ్డి, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు ఢిల్లీబాబురెడ్డి, చంద్రయ్యనాయుడు, సీపీఐ గురవయ్య, పులి శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

శివ, కేశవుల సేవలో హైకోర్టు న్యాయమూర్తి



వేదనారాయణ స్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి సుబ్బా రెడ్డి, కుటుంబ సభ్యులు



పళ్లికొండేశ్వర స్వామి సన్నిధిలో తీర్థప్రసాదాలు అందుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీవేదనారాయణ స్వామి, సురుటపల్లి శ్రీపళ్లికొండేశ్వర స్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మొదట ఆయన నాగలాపురం శ్రీవేదవల్లీ సమేత వేదనారాయణ స్వామిని దర్శించుకుని అక్కడి నుంచి సురుటపల్లిలోని శ్రీ మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి న్యాయమూర్తికి ఘన స్వాగతం పలికి స్వామి,అమ్మవార్ల దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు రాధాకృష్ణారెడ్డి, బోర్డు సభ్యులు మునివేలు, ఎస్‌ఐ హనుమంతప్ప పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్

- వాడవాడలా అంబేడ్కర్ జయంతి
- ఘన నివాళి అర్పించిన నేతలు, ప్రజాసంఘాల నాయకులు



ఎస్వీయూ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి కల్చరల్: భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు కూడళ్లలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. రాజకీయాలు పక్కనబెట్టి, కులమతాలకతీతంగా సమసమాజ నిర్మాత అంబేడ్కర్‌కు ఆత్మీయంగా అంజలి ఘటించారు.

చిరస్మరణీయులు అంబేడ్కర్

దేశానికి ఎనలేని సేవలందించిన చిరస్మరణీయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మంత్రి పెద్దిరెడ్డి, ఎస్వీయూ వీసీ రాజారెడ్డి, పాలక మండలి సభ్యుడు మల్లారపు మధు, డీఎంహెచ్‌ఓ శ్రీహరి తదితరులు ఎస్వీయూ యూనివర్సిటీ గేట్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. వైఎస్ఆర్‌సీపీ నేత ఎంఆర్‌సీ.రెడ్డి, ఎస్వీయూ అంబేడ్కర్ స్టడీ సెంటర్ కన్వీనర్ డాక్టర్ దామోదరం, డాక్టర్ కల్యాణ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, నాగేందర్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

అంబేడ్కర్ విగ్రహం వద్ద సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కళాశాల ఉండాలనే లక్ష్యంతో కొత్తగా 16 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. జేసీ డీకే.బాలాజీ మాట్లాడుతూ ప్రపంచంలో సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తుల్లో అంబేడ్కర్ ఒకరన్నారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగాన్ని సృష్టించిన గొప్ప మేధావి అంబేడ్కర్ అన్నారు. ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం నేత పరవశివన్, అంబేడ్కర్ భవన్ కమిటీ ప్రతినిధులు జయరాం, కె.మురళి, చెంగల్‌రాయులు, ఆర్‌పీఐ రాష్ట్ర నేత పి.అంజయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ పట్టుదల ఆచరణీయం




మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

త్రికూల పరిస్థితులకు భయపడి వెనుకడుగు వేయకుండా వాటిని తనకు అనుకూలంగా మార్చుకుని అనుకున్నది సాధించిన డాక్టర్ అంబేడ్కర్ పట్టుదల అందరికీ ఆచరణీయమని టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో డాక్టర్ అంబేడ్కర్ 132వ జయకంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. టీటీడీ ఉద్యోగులు అంబేడ్కర్ చూపిన మార్గంలో మరింత కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్‌వో నరసిహంహకిషోర్, భారత ఆధార్ ప్రాజెక్ట్ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ పీఎస్ఎస్.మూర్తి మాట్లాడారు. ఎస్వీ మాజీ వీసీ కొలకలూరి ఇనాక్ అంబేడ్కర్ విద్యావిజ్ఞానాన్ని, సమాజ సేవలను వివరించారు. యోగి వేమన వర్సిటీ ప్రొఫెసర్ వినోధిని, విజయవాడకు చెందిన సుప్రసిద్ధ విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య అంబేడ్కర్ సేవా నిరతిని కొనియాడారు. అనంతరం 45 మందికి కమ్యూనల్ అవార్డులు ప్రదానం చేశారు. వీరికి 5 గ్రాముల వెండి డాలర్, అంబేడ్కర్ చిత్రపటం అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టీటీడీ డీఈఓ భాస్కర్, పీఆర్‌ఓ టి.రవి, డెప్యూటీ ఈఓలు గోవిందరాజన్, ఆనందరాజు, స్నేహలత, నాగరత్న, జగదీశ్వరి పాల్గొన్నారు.

28న వేద విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

- దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయ సేవలు
- 40 మందికి పీహెచ్‌డీలు
- ప్రతి పౌర్ణమికి 59 ఆలయాల్లో సత్యనారాయణ వ్రతం
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుపతి తుడా: దేశంలో యూజీసీ గుర్తింపు ఉన్న ఏకైక వేద విశ్వవిద్యాలయమైన శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం సేవలు ఉత్తర భారత దేశంలోనూ విస్తరించాలని నిర్ణయించినట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఏప్రిల్ 28వ తేదీన వేద విశ్వవిద్యాలయం స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా నిర్ణయించామన్నారు. తిరుపతి శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో శుక్రవారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన వేద విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, హిందూ ధర్మప్రచార పరిషత్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ రుషికేష్‌లో వేద విశ్వవిద్యాలయం సేవలు ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వేద పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. వేద వర్సిటీలో పురాణ ప్రవచనం, యోగా, ధ్యానం అంశాల్లో ప్రత్యేకంగా సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించాలని నిర్ణయించినట్లు వివ రించారు. కరోనా కారణంగా నిలిపి వేసిన ఆదర్శ వేద గురుకుల విద్యను పునఃప్రారంభించనున్నట్టు వెల్లడించారు. టీటీడీ ఉద్యోగుల లాగే వేదిక్ వర్సిటీ రెగ్యులర్ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ అమలు చేస్తామన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 40 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించడానికి అనుమతించినట్లు తెలిపారు. వర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా ఇద్దరికి మహా మహోపాధ్యాయ, మరో ఇద్దరికి వాచస్పతి అవార్డులు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ప్రతి పౌర్ణమి రోజు తెలుగు రాష్ట్రాల్లోని 59 ముఖ్య ఆలయాల్లో శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం చేయాలని నిర్ణయించామన్నారు. అలాగే శ్రీనివాస వ్రతం ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్లు చైర్మన్ పేర్కొన్నారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి, టీటీడీ బోర్డు సభ్యులు రాములు, మల్లేశ్వరి, వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, సీవీఎస్వో నరసింహ కిషోర్, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రామింగ్ ఆఫీసర్ రాజగోపాల్, డీఈఓ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డీపీపీ కార్యదర్శి శ్రీనివాసులు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

జేసీబీ, టిప్పర్ సీజ్


టిప్పర్ వద్ద అధికారులు


స్వాధీనం చేసుకున్న జేసీబీ

సైదాపురం: మండలంలోని గులించెర్ల అటవీ సమీపంలో ఖనిజ సంపద కోసం రాత్రి పూట తవ్వకాలు సాగిస్తున్నట్టు అందిన రహస్య సమాచారం మేరకు దాడులు నిర్వహించి జేసీబీ, టిప్పర్ స్వాధీనం చేసుకున్నట్టు నెల్లూరు రేంజర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు..మర్లపూడి అటవీ సెక్షన్ అధికారులు గురువారం రాత్రి దాడులు నిర్వహించి.. ఖనిజ సంపద కోసం తవ్వుతున్న జేసీబీని, అక్కడే ఖనిజాన్ని లోడ్ చేసిన ట్రిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని అదుపులోకి తీసుకునే సమయంలో డ్రైవర్ సిబ్బందిపైకి వచ్చే ప్రయత్నం చేసి పరారయ్యాడు. ఈ విషయమై మర్లపూడి సెక్షన్, స్క్వాడ్ అధికారుల సమక్షంలో శుక్రవారం పంచనామా నిర్వహించారు. ఈ తనిఖీల్లో స్క్వాడ్ సెక్షన్ అధికారులు వరప్రసాద్, జేవీఆర్ ప్రసాద్, మర్లపూడి సెక్షన్ అధికారి అంకయ్య, సిబ్బంది గిరిజాకుమారి, ఖాసీం, సుధాకర్, అనేషా పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి పెద్దపీట


గజ మాలతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి స్వాగతం


భారీ జన సందోహం మధ్య మోహిత్‌రెడ్డి పాదయాత్ర

- 40 ఏళ్లనాటి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం
- రూ.30 లక్షలతో రహదారి నిర్మాణం
- సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ
- మహా పాదయాత్రలో మోహిత్‌రెడ్డికి విశేష ఆదరణ

భాకరాపేట: గ్రామ సమగ్రాభివృద్ధికి పెద్దపీట వేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎర్రవారిపాళెం గ్రామ పంచాయతీలో గడప గడపకు మహా పాదయాత్ర కొనసాగించారు. ఇందులో భాగంగా ఆయన మండల పరిధిలోని కలికిరివాండ్లపల్లి, చింతమ్మగారి పల్లి వాసుల రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. దాదాపు రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేశారు. అంతేగాకుండా బాలాజీనగర్ లో రూ.25 లక్షల సీసీ రోడ్డుకు మోహిత్‌రెడ్డి భూమిపూజ చేశారు.

మా నాయకుడు నువ్వే

చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచనల మేరకు మోహిత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మహా పాదయాత్ర' కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు అప్పటికప్పుడే పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతుండడం ప్రజల్లో సంతోషాన్ని నింపుతోంది. బసిరెడ్డిగారిపల్లి, కొత్తపల్లి, ఎర్రవారిపాళెం, కలికిరి వాండ్లపల్లి, పెద్దనాయనివారి పల్లి, కుమ్మర పల్లి, ఇర్లపాలెం ప్రాంతాల్లో గడప గడపన విశేష ఆదరణ లభించింది. గ్రామ గ్రామాన మోహిత్ రెడ్డికి అపూర్వ స్వాగతం పలికారు. మహిళకు హారతులు పట్టగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు గజ మాలలతో ఘనంగా సత్కరించారు.

రూ.6.78 కోట్లతో అభివృద్ధి పనులు

మండల పరిధిలో రూ.6.78 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో రూ.99.85 లక్షలకు సిమెంట్ రోడ్లు, ప్రభుత్వ భవన నిర్మాణాలకు రూ.5 కోట్లు ఖర్చు చేయగా, కాలువ నిర్మాణాలు, గ్రామ వేదికలు, సిమెంట్ బెంచీలు తదితర అభివృద్ధి పనులు చేపట్టామని మోహిత్ రెడ్డి వివరించారు.

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం

కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిన సీఎం జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని మోహిత్ రెడ్డి అన్నారు. మహిళా అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సర్పంచ్ అనపల ఎల్లమ్మ, సుబ్రమణ్యం, ఉప సర్పంచ్ హేమంత్ కిషోర్ రెడ్డి(సన్నీ), సీనియర్ నాయకులు పెద్ద రెడ్డెప్పరెడ్డి, మండల ఇన్‌చార్జి చెంగల్‌రెడ్డి, ఎంపీపీ శివలక్ష్మి, జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, పంచాయతీ కన్వీనర్ రమణారెడ్డి, డివిజనల్ అధ్యక్షులు నడిపి రెడ్డెప్పరెడ్డి, కన్వీనర్ నాగార్జునరెడ్డి, యూత్ నాయకులు శ్రీకాంత్, మధు, మల్లికార్జున్, మనోజ్, గంగిరెడ్డి, బాలగంగాధర్ నాయుడు, రాంబాబు, శ్రీనాథ్‌రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.63,180
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,643
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.79,300
రిటైల్ వెండి గ్రాము రూ.81.30

గుండెపోటుతో ఎంపీడీఓ మృతి


బాలగణేశన్(ఫైల్)

సత్యవేడు: స్థానిక ఎంపీడీవో బాలగణేశన్ గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన చిత్తూరులో నివాసం ఉంటున్నారు. శుక్రవారం తెల్లవారు జామున గుండెనొప్పి రావడంతో స్థానికంగా ఉన్న ఓ హాస్పిటల్ భార్యతో కలిసి వెళ్లారు. డాక్టర్ పరీక్షిస్తుండగా మరో మారు గుండెపోటు రావడంతో స్పృహకోల్పోయి మృతి చెందారు. ఎంపీడీఓ మృతిపట్ల ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీపీ వీ.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పీ. విజయలక్ష్మి, మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు సంతాపం తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన మినీ వ్యాను


కంచరపాళెం వద్ద తెలుగుగంగ ఉపకాలువలోకి దూసుకెళ్లిన మినీ వ్యాను

వరదయ్యపాళెం: వేగంగా వస్తున్న మినీ వ్యాను అదుపు తప్పి తెలుగుగంగ ఉపకాలువలోకి దూసుకెళ్లి ప్రమాదానికి గురైన ఘటన మండలంలోని కంచరపాళెం సమీపంలో చోటుచేసుకుంది. వాహనదారుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బీఎన్ కండ్రిగ మండలం కరకంబట్టుకు చెందిన మునిరాముడు డ్రైవర్ మునెయ్యతో కలసి తనకున్న మినీ వ్యాను ద్వారా తిరుపతి నుంచి తమిళనాడు వేలచ్చేరికి ఓ యజమానికి చెందిన ఇంటి వస్తువులను తరలిస్తున్నాడు. సత్యవేడు మార్గంలోని కంచరపాళెం సమీపంలోని మలుపు వద్ద శుక్రవారం సాయంత్రం తెలుగుగంగ మాంబట్టు ఉపకాలువలోకి వాహనం అదుపు తప్పి దూసుకెళ్లింది. దీంతో వాహనంలో ఉన్న యజమాని మునిరాముడు (45), డ్రైవర్ మునెయ్య (43)కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికుల సహకారంతో 108కు సమాచారమిచ్చి సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

చంద్రబాబు, లోకేష్ దళిత ద్రోహులు


లోకేష్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య, నాయకులు

నాయుడుపేట టౌన్: దళిత ద్రోహులు చంద్రబాబు, లోకేష్ అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ధ్వజమెత్తారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం లోకేష్ దిష్టి బొమ్మను దహనం చేశారు. యువగళం పాదయాత్రలో ఓ దళితుడు విదేశీ విద్య విషయమై అడిగితే లోకేష్ సహనం కోల్పోయి దళితులు పీకిందేమీలేదు, పొడిచిందేమీ లేదంటూ అసభ్యకరంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళలు లోకేష్ దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి నిరస వ్యక్తం చేశారు. గతంలో ఎవరైనా దళితుడిగా పుట్టాలని కోరుకుంటారా..? అంటూ చంద్రబాబు మాట్లాడిన తీరును గుర్తుచేసుకుని ఆవేదన చెందారు. తండ్రీకుమారులు దళితుల పట్ల అవమానకరంగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. విదేశీ విద్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, నాయకులు బైనా మల్లికార్జునరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కలికి మాధవరెడ్డి, ఒట్టురు కిషోర్‌యాదవ్, దారా రవి, గంధవళ్లి సిద్ధయ్య, రత్నశ్రీ, చదలవాడ కుమార్ పాల్గొన్నారు.

చెస్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా దివాకర్‌రెడ్డి


జాతీయ స్థాయి చెస్ టోర్నమెంట్ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి తదితరులు

- మేలో జాతీయ స్థాయి చెస్ టోర్నమెంట్

తిరుపతి ఎడ్యుకేషన్ : చెస్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, తిరుపతి జిల్లా చైర్మన్‌గా తిరుపతికి చెందిన డాలర్స్ గ్రూప్ అధినేత డాలర్స్ దివాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో శుక్రవారం జరిగిన చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ ఆడడం ద్వారా ఏకాగ్రత, మేథో సంపత్తి పెంపొందుతుందన్నారు. కార్పొరేట్‌కు పరిమితం కాకుండా గ్రామీణ స్థాయిలోనూ చెస్ క్రీడను విస్తరించేలా ప్రణాళికలు రూపొందించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. చెస్ క్రీడ మరింత వ్యాప్తికి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడ్డ చెస్ క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. వచ్చే నెల తిరుపతిలో జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్‌ను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ.శర్మ, కార్యదర్శి భీమారావు, కోశాధికారి జ్వాలాముఖి, తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున్, కార్యదర్శి శ్రీనివాస్ సూరి, కోశాధికారి అమర్నాథ్, వివిధ జిల్లాల చెస్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని దైనేడు గ్రామానికి చెందిన కిషోర్(22) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రాఘవేంద్ర కథనం.. దైనేడు గ్రామానికి చెందిన గంగయ్య, వాణి కుమారుడు కిషోర్ శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని తనువు చాలించాడు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర రెడ్డి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి, ఏపీ స్పెషల్ సీఎస్ కరికల్ వలవెన్, తెలంగాణ ఎంపీ బీబీ పాటిల్, ఐఏఎస్ అధికారి చక్రధర్ బాబు, సినీ నటి సంయుక్త మీనన్, ఏపీ టూరిజం ఎండీ కన్నబాబు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

రోడ్డుపైకొచ్చిన ఒంటరి ఏనుగు

పలమనేరు: మొసలిమొడుగు వద్ద పలమనేరు–గుడియాత్తం రహదారిపై శుక్రవారం సాయంత్రం నాలుగు ఓ ఒంటరి ఏనుగు రోడ్డుపైకి వచ్చేసింది. దీంతో ఏనుగును చూసి రోడ్డుపై వాహనాలను దూరంగా ఆపేశారు. కొందరు ఆకతాయిలు ఏనుగు సెల్ఫీ కోసం ఎగబడ్డారు. గురువారం ఏటిగడ్డ గ్రామ సమీపంలో హల్‌చల్ చేసిన ఒంటరి ఏనుగు కౌండిన్య నదిని దాటి శుక్రవారం మెయిన్ రోడ్డుపైకి వచ్చినట్టు స్థానికులు తెలిపారు.

పక్షుల కేంద్రంలో శరవేగంగా అభివృద్ధి పనులు


వేసవిలో పార్కులోని జింకలకు పచ్చిగడ్డి వేస్తున్న సిబ్బంది


చెరువు కట్టపై వ్యూ పాయింట్ వద్ద సందర్శకుల కోసం షెడ్డు ఏర్పాటు


కేంద్రంలోని అటవీ ప్రాంతంలో జింకల కోసం ఏర్పాటు చేసిన నీటికుంట

దొరవారిసత్రం : శీతాకాలపు విదేశీ వలస విహంగాల సంతానోత్పత్తి కేంద్రంగా భాసిల్లుతున్న నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. సందర్శకుల సౌకర్యార్థం, పక్షులు, జింకల ఆవాసయోగ్యంగా స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వనవిహారి, కాంప పథకాల ద్వారా రూ.10లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో కొన్ని పనులు ఇప్పటికే పూర్తిచేశారు. పక్షుల కేంద్రం పరిధిలోని అటవీ ప్రాంతంలో 500 జింకల వరకు సంచరిస్తున్న నేపథ్యంలో వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ఐదు ప్రాంతాల్లో వనవిహారి పథకం కింద రూ.5 లక్షలతో నీటి కుంటలు నిర్మించారు. ప్రస్తుతం ఈ కుంటల్లో వర్షపునీరు నిల్వ ఉంది. అదేవిధంగా చెరువు కట్టపై వ్యూ పాయింట్ల వద్ద సందర్శకుల సౌకర్యార్థం మూడు ప్రాంతాల్లో ఒక్కొక్కటి రూ.85 వేలు వెచ్చించి షెడ్లు నిర్మిస్తున్నారు. ఇక్కడే పర్యాటకులు సేద తీరేలా 20 సిమెంట్ బెంచీలు సిద్ధం చేస్తున్నారు. నేలపట్టు గిరిజన కాలనీలో రూ.3లక్షల వ్యయంతో 12 సోలార్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు.


విడిది చేస్తున్న నత్తగుల్లకొంగలు

ఈ సీజన్‌లోనే అధికం



గతంలో ఎన్నడూ రానంత ప్రవేశ రుసుం ఈసీజన్‌లో (గత నెల మార్చి వరకు) రూ.15.4 లక్షలు వచ్చింది. ఈ నగదుతో పక్షుల కేంద్రంలో సందర్శకులకు అవసరమైన వసతులు, సౌకర్యాలు వంటివి కల్పిస్తున్నాం. వేసవి అయినప్పటికీ ప్రత్యేకించి కేంద్రంలోని పార్కులో ఉన్న జింకల కోసం పచ్చిగడ్డితో పాటు దాణా, కూరగాయలను ఆహారంగా వేస్తున్నాం. ఈ నెలఖారిలోపు విహంగాలు వాటి సంతానంతో వెనుదిరిగి ఆయా దేశాలు వెళ్లిపోతాయి. – బీ వరప్రసాద్, ఎఫ్‌ఆర్‌ఓ, నేలపట్టు పక్షుల కేంద్రం